ఎక్కడ మురుగు అక్కడే..

ఇష్టానుసారంగా డ్రెయినేజీల నిర్మాణం

- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- నిలిచిన మురుగుతో దోమలు, దుర్వాసన
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు


సుందరయ్యనగర్‌లోని ఓ వీధి కాల్వలో పేరుకుపోయిన చెత్త

మణుగూరుటౌన్: అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ ఇష్టానుసార డ్రెయినేజీల నిర్మాణం.. చెత్త సేకరణలో నిర్లక్ష్యం మున్సిపాలిటీ ప్రజలకు శాపంగా మారింది. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన డ్రెయినేజీలతో ఎక్కడ మురుగు అక్కడే ఆగి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మున్సిపాలిటీ వాహనాలు అప్పుడప్పుడు మాత్రమే వస్తుండటంతో చెత్త, దుర్వాసనతో రోగాలు ప్రబలతున్నాయని మున్సిపాలిటీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎత్తుపల్లాలు బేరీజు వేయకుండా..
మున్సిపాలిటీ పరిధిలోని సినిమాహాల్ థియేటర్ ఏరియాలో గత ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షల ఎస్ఎస్‌సీ నిధులతో నిర్మించిన సీసీ డ్రెయినేజీ ఎత్తు పల్లాలు బేరీజు వేయకుండా కట్టడంతో మురుగు వెళ్లే దిశ మారి ఎక్కడి మురుగు అక్కడే దర్శనమిస్తూ కంపు కొడుతోంది. అదేవిధంగా సుందరయ్యనగర్, శ్రీశ్రీనగర్, శేషగిరినగర్ ఏరియాల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో పాటు మురుగు పోయే దారి లేక అక్కడే నిలుస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డబ్బు ఇవ్వాలంటున్నారు..



రోజూ చెత్త వాహనం రాకపోవడంతో కొందరు అపరిచితులు చెత్తలను కాల్వలో వేస్తున్నారు. దీంతో మురుగు నీరు సాఫీగా పారే పరిస్థితి లేదు. సమస్య మున్సిపాలిటీ అధికారులకు, సిబ్బందికి చెబితే డబ్బులు అడుగుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పై పై పనులు చేసి వెళ్లిపోతున్నారు. దోమలు వ్యాప్తి చెంది రోగాలతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్య పరిష్కరించండి.

– హిమాద్రి లక్ష్మి, కాళీమాత ఏరియా

పారిశుద్ధ్యం పట్టించుకోవడం లేదు



వానాకాలం, అధికారులు వస్తేనే హడావుడి చేస్తున్నారు. వీధిలైటు పోయి చెత్త సేకరణ లేకపోవడంతో దుర్వాసన, రోగాలు, పాములు పురుగులు వస్తున్నాయి. ఇంటి పన్నుల కోసం మాత్రమే సమయానికి వచ్చి డబ్బులు కట్టకపోతే జప్తులు చేస్తామంటూ హెచ్చరికలు చేస్తున్నారు. వీధుల్లో సమస్యలు చెబితే పెడ చెవిన పెడుతున్నారు. కనీసం వారానికి ఒకసారైనా చెత్త బండ్లు పంపడం లేదు.

– ఆకుతోట అమృతమ్మ, సుందరయ్యనగర్


డ్రెయినేజీలో నిలిచిన మురుగునీరు


మురుగు నిలిచిపోవడంతో డ్రెయినేజీ శుభ్రం చేసుకుంటున్న స్థానికులు

చెత్త సేకరణ అంతంత మాత్రమే...

మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా, ప్రధాన వార్డులో చెత్త సేకరణ అంతంమాత్రంగానే జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారిని పూర్తిగా శుభ్రం చేయడం మినహా కమలాపురం, రాయిగూడెం, బాలాజీ నగర్, కాళీమాత ఏరియా, గాంధీనగర్, పాత మణుగూరు, రాజుపేట ఏరియాలలో చెత్త సేకరణకు వారానికి ఒక్కసారి కూడా మున్సిపాలిటీ వాహనాలు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు తొలగించి రోగాల బారిన పడకుండా కాపాడాలని కోరుతున్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న డ్రెయినేజీలు..

చర్ల రూరల్: చర్ల మేజర్ గ్రామ పంచాయితీలోని డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో ఎక్కడి మురుగు నీరు అక్కడే నిలిచిపోయింది. కొన్ని చోట్ల అయితే ముక్కు మూసుకుని వెళ్ళాల్సిన పరిస్థితి ఉంది. వ్యర్థాలు భారీగా పేరుకుపోయి దుర్వాసన వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మురుగు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపిస్తున్నారు. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో డ్రెయినేజీలను శుభ్రం చేసి దోమలు విస్తరించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై చర్ల పంచాయితీ కార్యదర్శి వివరణ కోరగా త్వరలో స్పెషల్ డ్రైవ్ ద్వారా డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తామన్నారు.



డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగు

లారీలకు లోడింగ్ పెంచండి

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని లారీలకు బొగ్గు లోడింగ్ పెంచాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య ఆధ్వర్యంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ గుమస్తాల సంఘం బొగ్గు ముఠా వారి డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్ సభ్యులు జీఎం దుర్గం రాంచందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ప్రజలు ఇంటి స్థలాలు, భూములు, ఇళ్లు కోల్పోయి సంస్థకు దారాదత్తం చేసి సర్వస్వం కోల్పోయారన్నారు. సింగరేణి యాజమాన్యం బొగ్గు తరలింపుపై లారీలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడిన వారిని లోడింగ్ పెంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్, లక్ష్మీనారాయణ, సుధాకర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు, ఏసుబాబు, మురళీ, శేఖర్‌రెడ్డి, సంతోష్, రాజు, ఆదర్ల సురేందర్, రమేశ్, రాజబాబు, శ్రీను తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ముత్యాలమ్మ తల్లి జాతర


ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామ శివారులోగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద నేటి(శనివారం) నుంచి జాతర మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ నెల 10 వరకు జరిగే ఈ జాతర ఉత్సవాలకు ఇప్పటికే దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ మేరకు జాతర మహోత్సవాల ఏర్పాట్లను శుక్రవారం స్థానిక సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై శ్రీరాముల శ్రీను పరిశీలించారు. ముందుగా ముత్యాలమ్మ తల్లి ఆలయం, పాత ఆలయంలో సీఐ, ఎస్సై అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించి, జాతర ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అలాగే వాహనాలకు పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత


నగదు అందజేస్తున్న దృశ్యం

మణుగూరు టౌన్: మండలంలోని అశోక్‌నగర్‌కి చెందిన లారీ డ్రైవర్, ఓనర్ పిచ్చయ్యకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి శాశ్వత అంగవైకల్యం ఏర్పడటంతో తోటి డ్రైవర్లు, లారీ యజమానులు చేయూత అందించి అండగా నిలిచారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక లారీ యజమానులు, డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.83వేల ఆర్థిక సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. జున్నూరు వెంకన్నబాబు, స్వామి, మిడిదొడ్ల నాగేశ్వరరావు, తూపూడి శ్రీనివాసరావు, కనకయ్య, లాలూ, చింటూ, బాలకృష్ణ, నాగయ్య, వెంకన్న, దామల్ల లక్ష్మణ్, రవి, మురళీ, వలి, సింహాచలం, బాబ్జీ తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందు


భోజనం వడ్డిస్తున్న శేఖర్

చంద్రుగొండ : మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు సారేపల్లి శేఖర్ ఆధ్వర్యంలో ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్‌విందు ఇచ్చారు. హిందూముస్లింలు ఐక్యత ఉండాలని, పరస్పరం సోదరభావంతో మెలగాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. మజీద్‌కమిటీ సదర్ ఎండీ.షమీహుసేన్, నాయకులు ఇమ్రాన్, వసీం, బుంగా శ్రీనివాసరావు, కడియాల పుల్లయ్య, రాందాస్ మనోహర్ పాల్గొన్నారు.

బంగారు నామం బహూకరణ


దాతకు రశీదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని తాతగుడి సెంటర్‌లోని దాసాంజనేయ స్వామివారి ఆలయానికి స్వామివారి బంగారు నామం విరాళం ప్రకటించారు. పట్టణానికి చెందిన చారుగుళ్ల శివరావు–సీతారత్నం జ్ఞాపకార్థం కుమార్తె రేపాక రూపావతి, కుమారుడు శ్రీనివాస్‌లు రూ.92 వేల విలువ చేసే స్వామివారి బంగారు నామంను ఆలయ కమిటీకి శుక్రవారం అందజేశారు. అలాగే స్వామివారి ఆలయ కమిటీ పేరున రూ.లక్ష బ్యాంక్‌లో డిపాజిట్ చేసి నగదుతో వచ్చే వడ్డీని ప్రతీ సంవత్సరం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమం నిర్వహించే విధంగా ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తోట శేషు సాయి, ప్రధాన కార్యదర్శి కటుకూరి హరిబాబు, ఆలయ అర్చకుడు కిరణ్, వెంకటరమణ, నాగభూషణం పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్తలు తప్పనిసరి

కరకగూడెం: ఎండలు తీవ్రరూపం దాల్చినందున ఎండ వేడిమినుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కారం మధు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వైద్య శిబిరాలు నిర్వహించి మండల వాసులకు ఎండలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
చర్ల రూరల్ : వేసవి కాలంలో వచ్చే జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అవసరమైతే తప్పా బయటకు రావద్దని కోరారు. వడదెబ్బ తగలకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తగా ఉండాలని, వీలైనప్పుడల్లా నీరు తాగాలని సూచించారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

అశ్వాపురం: మహిళ పోగొట్టుకున్న పర్సును తనకు శుక్రవారం అందజేసి ఆటోడ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నారు. మండలంలోని కొర్సవారిగూడెం గ్రామానికి చెందిన కుంజా సులోచన మండలకేంద్రంలో ఆటోస్టాండ్ వద్ద తన పర్సు పోగొట్టుకోగా ఆ పర్సు ఆటో డ్రైవర్ చల్లగుండ్ల వెంకన్నకు దొరికగా అందులో కొంత నగదు, ఆధార్‌కార్డు ఉన్నాయి. ఆధార్‌కార్డు మీద ఉన్న సమాచారంతో ఆటో యూనియన్ నాయకులు సులోచనకు పర్సు అప్పగించారు. నాయకులు రమణయ్య, కొమ్ము రాంబాబు, మడిపల్లి రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



కరకగూడెం: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కరకగూడెం: ఓటు హక్కుతో ప్రజా స్వామ్యం పరిఢవిల్లుతుందని, ప్రలోభాలాకు లోనుకాకుండా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'మీ తహసీల్దార్ మీ ఇంటికి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కన్నాయిగూడెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఓటు యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ మాట్లాడుతూ.. ప్రజలు నిజాయితీగా ఓటు వేయాలని, ఓటు హక్కును దుర్వినియోగం చేయొద్దని కోరారు. అనంతరం గ్రామస్తుల నుండి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు షేక్ హుస్సేన్,రాజు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
అశ్వాపురం: ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ ప్రమీల అన్నారు. మండల పరిధిలోని మంచికంటినగర్ గ్రామంలోని ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమాన్ని శుక్రవారం సీడీపీఓ సందర్శించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి వృద్ధులతో మాట్లాడారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సక్కుబాయి, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ్రమం నిర్వాహకురాలు షహనాజ్‌భేగం తదితరులు పాల్గొన్నారు.



అశ్వాపురం: ఆరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమంలో..

జనజాతర సభను విజయవంతం చేయాలి


మణుగూరు టౌన్: మాట్లాడుతున్న నవీన్

మణుగూరు టౌన్: హైదరాబాద్ పరిధిలోని తుక్కుగూడలో చేపట్టిన భారీ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పిరినాకి నవీన్ అన్నారు. శుక్రవారం డివిగ్రాండ్‌లో జరిగిన మణుగూరు మండల, పట్టణ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడగా పట్టణాధ్యక్షుడు శివ, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయశంకర్, పల్లపు తిరుమలేశ్, అబ్దుల్లా, రాజు, గణేశ్‌రెడ్డి, గాండ్ల సురేశ్, సాంబశివరావు ఉన్నారు.
కరకగూడెం: జన జాతర బహిరంగసభకు మండలం నుండి వేలాదిగా తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు మోకాళ్ల పాపారావు, సురేష్, జలగం కృష్ణ, అత్తే సారయ్య, పూజారి వెంకన్న,ఎల్లబోయిన సత్యం, కరకపల్లి నాగేష్, భూక్య రాందాస్, కోరగట్ల విశ్వనాథం, దంచనాల రాజేంద్రప్రసాద్, భిక్షపతి, వగలబోయిన శ్రీనివాస్, కేశవరవు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది కొరత..

గుండాల: మారుమూల ఏజెన్సీలో ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని, ఒకే ఒక వైద్యాధికారితో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజాపంథా నాయకులు కుమార్ అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 గంటల ఆస్పత్రి అయినప్పటికీ ఇద్దరు వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారని, ఆయన సెలవుపై వెళ్లిన క్రమంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇద్దరి వైద్యాధికారులను నియమించి, మందుల కొరతతదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గోటి తలంబ్రాలు సమర్పణ


తలంబ్రాలను తీసుకొస్తున్న భక్త మండలి సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవానికి భూపాలపల్లి జిల్లా చెల్పూర్ గ్రామానికి చెందిన రామభక్తులు శుక్రవారం గోటి తలంబ్రాలను ఆలయ అధికారులకు అందజేశారు. చెల్పూరుకు గ్రామానికి చెందిన భక్త రామదాసు భక్త మండలి ఆధ్వర్యంలో ఐదేళ్ల నుంచి రామయ్య కల్యాణం కోసం ప్రత్యేకంగా పండించిన వరి ధాన్యాన్ని గోటితో వలిచి భద్రాద్రి రామయ్యకు సమర్పిస్తున్నారు. ఈ క్రమంలోనే భద్రాద్రి చేరుకున్న రామదాసు భక్తమండలి సభ్యులు కోలాటన్యత్యాలు రామానామ స్మరణతో ఆలయానికి చేరుకుని తలంబ్రాలకు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామి వారికి సమర్పించారు. ఆలయ ఈఓ ఎల్ రమాదేవి, రామదాసు భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం


భద్రాచలంటౌన్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్, తదితరులు


మణుగూరు రూరల్: బీటీపీఎస్‌లో..


భద్రాచలం: ఐటీడీఏ సమావేశ మందిరంలో..



అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కళాశాలలో..


అన్నపురెడ్డిపల్లి: నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది


మణుగూరు టౌన్: బాపూజీ నగర్‌లో..

భద్రాచలంటౌన్: భారత మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహనీయుల పోరాటాల స్ఫూర్తి వారు చేసిన త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దా పిచ్చయ్య, అలవాల రాజా, రాజేశ్వరావు, దేవాదానం, శంకర్‌రావు, తిరుపతిరావు, రవికుమార్, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.
భద్రాచలం: సామాజిక సమానత్వానికి, అణగారి వర్గాల హక్కుల పోరాటానికి జగ్జీవన్‌రామ్ చూపిన ఉద్యమ స్ఫూర్తి ఇప్పటికీ ఆదర్శనీయమని ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీటీఆర్ఓ ఏఫ్ఆర్ శ్రీనివాస్, ఏపీ ఓ(పవర్) మునిర్ పాషా, ఏటీడీఓ నరసింహారావు, డీఎస్ఓ ప్రభాకరరావు, పీవీటీజీ అధికారి నరేష్, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరి కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.
అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాల, పాత మండల పరిషత్ కార్యాలయం స్థానిక భీమ్ రామ్ ఆర్మీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో హరిత విప్లవం విజయవంతం కావడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ రమేష్, డాక్టర్ రెడ్డిప్రియ, డాక్టర్ లక్ష్మణ్, భీమ్ రామ్ ఆర్మీ బాధ్యులు పాల్గొన్నారు.
కరకగూడెం: స్థానిక తహసీల్‌లో తహసీల్దార్ నాగప్రసాద్ జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
అన్నపురెడ్డిపల్లి: స్థానిక తహసీల్‌లో రెవెన్యూ సిబ్బంది జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
మణుగూరు టౌన్: స్థానిక బాపూజీ నగర్‌లో ఘనంగా మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు బోయిళ్ల రమణయ్య, ఇందునూరి అశోక్‌కుమార్, వేంపల్లి సతీష్, కే.సత్తిబాబు, పరమేశ్ తదితరులు ఉన్నారు.
మణుగూరు రూరల్: స్థానిక బీటీపీఎస్ ఆవరణలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, ఎస్ఈ పార్వతి, శ్రీనివాసరావు, రమేష్ బాబు, సూర్యనారాయణ, రమణమూర్తి, రాంప్రసాద్, డీఈలు, ఏడీఈలు కార్మికులు పాల్గొన్నారు.
చంద్రుగొండ : ఎమ్మార్పీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు నారపోగు మధు, చాపలమడుగు వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు, కుమార్, వెంకన్న, రంగా, రాముడు, సత్యనారాయణ పాల్గొన్నారు.
చర్ల: మండల కేంద్రంలోని తహసీల్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు, ఆర్‌ఐలు వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కరకగూడెంలో..


చంద్రుగొండలో..


చర్లలో...

ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కార్మికులకు అందజేస్తున్న సౌకర్యాలను వేసవి నేపథ్యంలో మరింత మెరుగుపర్చాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచి కమిటీ ప్రధాన కార్యదర్శి గట్టయ్య అన్నారు. శుక్రవారం ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ఐఎన్‌టీయూసీ నాయకుల బృందం అక్కడ చికిత్సలు పొందుతున్న కార్మికులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు క్యాజువాలిటీలో ఏసీలు, కూలర్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు షాబుద్దీన్, కరుణాకర్, రామారావు, రాము, ప్రతాపరెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

సన్మానం

చంద్రుగొండ : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వాసిరెడ్డి కృష్ణకుమారికి శుక్రవారం ఘనంగా సన్మానించారు. అయన్నపాలెం గ్రామంలోని లక్ష్యాగార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో కృష్ణకుమారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు కృష్ణమోహన్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు యండీ ఆరీఫ్‌హుసేన్, పాల్వంచ ఎంఈఓ శ్రీరాంమూర్తి, జయకర్, ఉపాధ్యాయులు మంజుశ్రీ, వీరన్న పాల్గొన్నారు.